
సాక్షి కృష్ణాజిల్లా

శనివారం । 12 । ఏప్రిల్ । 2025



పూలే చిరస్మరణీయుడు

భవానీపురం: విజయవాడలో తుమ్మలపల్లి కళాక్షేత్రం వద్ద శుక్రవారం జ్యోతిరావు పూలే విగ్రహానికి నివాళులర్పించిన వైఎస్సార్ సీపీ నేతలు పూలే చిరస్మరణీయుడని కొనియాడారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 515.10 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి కుడికాల్వకు నీటిని నిలుపుదల చేశారు.



మిర్చి యార్డుకు వరుస సెలవులు

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శనివారం నుంచి వరుసగా మూడు రోజుల పాటు సెలవులు ప్రకటించారు. మంగళవారం నుంచి క్రయ విక్రయాలు కొనసాగుతాయి.

న్యూస్‌రీల్

వక్ఫ్ సవరణ బిల్లు రద్దు చేయండి

పెడనలో ముస్లింల భారీ ర్యాలీ



పెడన: వక్ఫ్ సవరణ బిల్లు రద్దు చేయకపోతే ప్రాణత్యాగాలకు సైతం సిద్ధంగా ఉంటామని, తక్షణం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వక్ఫ్ బిల్లును వెనక్కు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు, జామియా మసీదు కార్యదర్శి అయూబ్‌ఖాన్ అన్నారు. పెడన జామియా మసీదు కమిటీ అధ్యక్షుడు అబ్దుల్‌ఖదీర్, మసీదు కార్యదర్శి అయూబ్ ఖాన్‌ల ఆధ్వర్యాన వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా శుక్రవారం పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అయూబ్ ఖాన్ మాట్లాడుతూ దాతల సాయంతో సమకూరిన ఆస్తులను లాక్కోవడానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంతో పాటు దానితో చేతులు కలిపిన పార్టీలు చూస్తున్నాయని దుయ్యబట్టారు. అల్లా ఆస్తులను అల్లాయే కాపాడుకుంటారని స్పష్టం చేశారు. పలువురు ముస్లిం పెద్దలు మాట్లాడుతూ వక్ఫ్ బిల్లును తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. వక్ఫ్ బిల్లు వెనక్కు తీసుకునే వరకు పోరాడతామని వారు హెచ్చరించారు. ర్యాలీ గుడివాడ రోడ్డులోని జామియా మసీదు నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు జరి గింది. మున్సిపల్ కార్యాలయం సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మహాత్మాగాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పెద్ద సంఖ్యలో ముస్లింలు తరలి వచ్చారు. దారుల్‌బీర్ మదరసాకు చెందిన విద్యార్థినిలు సైతం ర్యాలీలో పాల్గొన్నారు.

దుర్గమ్మకు 110 గ్రాముల బంగారు హారం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు రూ.10 లక్షల విలువైన 110 గ్రాముల బంగారు హారాన్ని భక్తులు శుక్రవారం కానుకగా సమర్పించారు. హైదరాబాద్ అమీర్‌పేటకు చెందిన దేవినేని సురేంద్ర కుటుంబం అమ్మవారిని దర్శించుకునేందుకు కుటుంబ సమేతంగా ఇంద్రకీలాద్రికి విచ్చేసింది. ఈ సందర్భంగా ఆలయ ఈవో కె.రామచంద్రమోహన్‌ను కలిసి బంగారు హారాన్ని అందజేశారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వారు మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మనసారా కొలిచారు. మొక్కులు చెల్లించుకున్నారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం దాతలకు ఆలయ ఈవో రామచంద్రమోహన్ అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేష వస్త్రాలను బహూకరించారు.

నంది వాహనంపై ఆది దంపతులు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రి పై నిర్వహిస్తున్న చైత్ర మాస బ్రహ్మోత్సవాల్లో నాల్గో రోజైన శుక్రవారం శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్లు నంది వాహనంపై నగరోత్సవ సేవ జరిగింది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని మహా మండపం దిగువన నంది వాహనాన్ని వివిధ వర్ణాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దగా, శ్రీ గంగా పార్వతి (దుర్గ) సమేతంగా మల్లేశ్వర స్వామి వారు అధిష్ఠించారు. ఆది దంపతులకు ఆలయ అర్చకులు పూజా కార్యక్రమాలను నిర్వహించిన అనంతరం నగరోత్సవ సేవను లాంఛనంగా ప్రారంభించారు. భక్తజనం ఆదిదంపతులకు జేజేలు పలికారు. స్వామివారు, అమ్మవార్లను మనసారా కొలిచారు. మహామండపం నుంచి ప్రారంభమైన నంది వాహన సేవ కనకదుర్గనగర్, రథం సెంటర్, బ్రాహ్మణ వీధి, సామారంగం చౌక్ మీదగా ఆలయానికి చేరుకుంది. మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, చిన్నారులు, మహిళల కోలాట నృత్యాలు, డప్పు కళాకారుల విన్యాసాల నడుమ ఊరేగింపు కనుల పండువగా సాగింది. నగరోత్సవ సేవలో ఆలయ ఏఈవో దుర్గారావు, ఆలయ అధికారులు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

జిల్లాలో సముద్రతీరం బోసిపోనుంది. నిశిరాత్రిలో వలలు భుజాన వేసుకుని వెళ్లే గంగపుత్రులు చేపల వేటకు దూరం కానున్నారు. ప్రభుత్వం చేపలవేటపై రెండు నెలలు విరామం ఇవ్వడంతో మత్స్యకారులు సముద్రానికి దూరంగా.. తీరానికి ప్రయాణమవుతున్నారు. సముద్రంలో చేపలు గుడ్లు పెట్టే సమయంలో ఎటువంటి ఇబ్బందులు రాకూడదనే ఉద్దేశంతో దీన్ని ఏటా అమలుచేస్తున్నారు. అయితే గతేడాది నిషేధ భృతి ఇప్పటి వరకు అందకపోవడంతో జిల్లాలో మత్స్యకారులు ఎదురుచూస్తున్నారు.

చేపల వేటకు లంగరు

ఏటా ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 వరకు నిషేధం అమలు

- సముద్రంలో వేట నిషేధం
- వేట బోట్లు ఒక్కొక్కటిగా తిరిగి తీరానికే ప్రయాణం
- మత్స్యసంపద పునరుత్పత్తికి ఏటా నిషేధం
- వైఎస్సార్ సీపీ హయాంలో గంగపుత్రులకు భరోసా
- గతేడాది వేట నిషేధ భృతి మంజూరులో కూటమి ప్రభుత్వ అలసత్వం



తీరంలో నిలిపి ఉన్న బోట్లు

మచిలీపట్నంఅర్బన్/నాగాయలంక: సముద్ర జలాల్లో చేపల వేటకు మత్స్యకారులు లంగరు వేయనున్నారు. ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 వరకు 61 రోజుల పాటు సముద్రంలో వేట నిషేధంపై ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మత్స్య సంపద అభివృద్ధికి ప్రభుత్వం నిషేధం విధిస్తోంది. ఈ సమయంలో మరబోట్లు, మెకనైజ్ బోట్లు, మోటారు బోట్లతో సముద్రంలోకి వెళ్లడం నిషేధం. ఎవరైనా ప్రభుత్వ ఉత్తర్వులు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటారు.

వేట నిషేధ భృతి ఎక్కడ

2023-24లో వేట నిషేధ భృతి కింద బందరు, దివిసీమ తీరప్రాంతాల్లో 12,748 మంది మత్స్యకారులను అర్హులుగా ప్రతిపాదించారు. వేట నిషేధ భృతి కింద 12,151 మంది బ్యాంక్ ఖాతాల్లోకి వైఎస్సార్ సీపీ హయంలో రూ.10 వేలు చొప్పున నేరుగా రూ12.15 కోట్లు జమచేశారు. 2024-25 వేట నిషేధ భృతి క్రింద 12,809 మంది మత్స్యకారులను గుర్తించారు. సుమారు 12.89 కోట్లు ఇవ్వాల్సి ఉంటుంది. గతేడాది ఎన్నికల కోడ్ రావడంతో భృతి అందలేదు. అయితే తర్వాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం మత్స్యకారులకు వేట నిషేధభృతి రూ 20 వేలు ఇస్తామంటూ వాగ్దానాలు చేసింది. ఇప్పటివరకు గతేడాది భృతి మంజూరవకపోవడం మత్స్యకారుల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తోంది.

తీరానికి చేరుకుంటున్న బోట్లు

రెండునెలల విరామానికి బోట్లు తీరానికి చేరుకుంటున్నాయి. చేపల పునరుత్పత్తి కోసం సముద్రంలో 61 రోజుల పాటు వేట నిషేధం సోమవారం అర్ధరాత్రి నుంచి అమల్లోకి వస్తుంది. వేట విరామాన్ని ఉల్లంఘించిన వారి బోట్లను సీజ్ చేయడమేగాక సంక్షేమ పథకాలు కట్ చేస్తామని అధికారులు చెబుతున్నారు.

వైఎస్సార్ సీపీ హయాంలో..

ఆర్బీకేల్లో పనిచేసే గ్రామ మత్స్య సహాయకుడితో పాటు వలంటీర్ సాగరమిత్రలతో ఏర్పాటు చేసిన బృందాలతో లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియ చేపట్టేవారు. తీరంలో లంగరేసిన బోట్లను ఈ బృందాలు పరిశీలిస్తాయి. గ్రామ సచివాలయ డిపార్ట్‌మెంట్ రూపొందించే సాఫ్ట్‌వేర్‌లో అవసరమైనా డాక్యుమెంట్లను అప్లోడ్ చేసేవారు. వెరిఫికేషన్ తర్వాత జాబితాలను సామాజిక తనిఖీ కోసం ఆర్బీకేల్లో ప్రదర్శించేవారు. అభ్యంతరాలను పరిశీలించిన తర్వాత ఈ మొత్తం ప్రక్రియ ఏప్రిల్ ఆఖరులోగా పూర్తి చేసి మే నెలలో మత్స్యకారుల బ్యాంకు ఖాతాలకు నేరుగా జమచేస్తూ ప్రభుత్వం అండగా నిలిచింది.

భృతిని అందించాలి



గత ఏడాది భృతి మాకు రాలేదు. ఎదురుచూస్తూ రోజులు గడిపాం. బతుకే ఆగినట్టుగా అనిపించింది. ఈసారి అయినా ముందుగానే ప్రభుత్వం స్పందించి భృతిగా ఇస్తామన్న రూ.20 వేలు అందిస్తే బాగుంటుంది.

–పొనాల నాగలక్ష్మణరావు (తాతయ్య), మత్స్యకారుడు పల్లెతాళ్లపాలెం, మచిలీపట్నం

ఎటువంటి ఆదేశాలు లేవు

సముద్రంలో వేట నిషేధంపై ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నిషేధ కాలంలో ఇచ్చే భృతికి సంబంధించి ఎటువంటి ఆదేశాలు ప్రభుత్వం నుంచి రాలేదు. ఆదేశాలు అందిన వెంటనే చర్యలు తీసుకుంటాం.

–అయ్య నాగరాజు, జాయింట్ డైరెక్టర్ మత్స్యశాఖ, మచిలీపట్నం

అక్రమ కేసులతో జర్నలిజాన్ని అణచివేయలేరు

సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనంజయరెడ్డి, మరో ఆరుగురు పాత్రికేయులపై క్రిమినల్ కేసులు పెట్టడాన్ని శుక్రవారం పలు పాత్రికేయ సంఘాలు తీవ్రంగా ఖండించాయి. అక్రమ కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశాయి. కూటమి ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఉమ్మడి జిల్లాతోపాటు పలు నియోజకవర్గాల్లో పాత్రికేయులు నిరసన కార్యక్రమాలు నిర్వహించి అధికారులకు వినతిపత్రాలు అందజేశారు.



సాక్షి ఎడిటర్ ధనంజయరెడ్డి, ఆరుగురు జర్నలిస్టులపై పెట్టిన అక్రమ కేసును ఉపసంహరించుకోవాలని కోరుతూ కలెక్టర్ డీకే బాలాజీకి వినతిపత్రం అందజేస్తున్న మచిలీపట్నం పాత్రికేయులు

- సాక్షి ఎడిటర్, జర్నలిస్టులపై పెట్టిన క్రిమినల్ కేసులు తక్షణం ఉపసంహరించుకోవాలి
- పాత్రికేయ సంఘాలు

మచిలీపట్నం అర్బన్: పత్రికా స్వేచ్ఛను హరించి అక్రమ కేసులతో జర్నలిజాన్ని అణచివేయలేరని ఉమ్మడి కృష్ణా జిల్లాలోని పాత్రికేయ సంఘాలు స్పష్టం చేశాయి. సాక్షి ఎడిటర్ ఆర్.ధనంజయ రెడ్డిపై, ఆరుగురు జర్నలిస్టులపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఉపసంహరించాలని డిమాండ్ చేస్తూ మచిలీపట్నం పాత్రికేయుల ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టర్ డీకే బాలాజీకి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రజలకి వారధిగా ఉండే పత్రికారంగాన్ని అక్రమ కేసులతో అణచివేయాలనుకోవడం అవివేకమన్నారు. సమాజంలో జరుగుతున్న అన్యాయాన్ని పత్రికలతో ప్రజలకు తెలియజేసే భావ ప్రకటన స్వేచ్ఛ పాత్రికేయులకు ఉందన్నారు. ధనంజయరెడ్డిపై బనాయించిన అక్రమ కేసును కూటమి ప్రభుత్వం వ్యక్తిగత విరోధంతో చేపట్టిన చర్యగా భావిస్తున్నామన్నారు. ధనంజయరెడ్డి, ఇతర జర్నలిస్టులపై పెట్టిన కేసుతో పత్రికా స్వేచ్ఛను కూటమి ప్రభుత్వం అణచివేసే ప్రయత్నం చేస్తోందన్నారు. పత్రికల్లో తప్పును తప్పుగా చూపిస్తే తప్పుడు కేసులు పెట్టి ఇబ్బందులు పెట్టాలని చూడడం సహేతుకం కాదన్నారు. జర్నలిజంపై ఉక్కుపాదం మోపాలని చూడటం అవివేకమన్నారు. ధనుంజయరెడ్డితో పాటు ఆరుగురు జర్నలిస్టులపై పెట్టిన తప్పుడు కేసును పోలీసులు వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం తప్పుడు కేసులను ప్రోత్సహించే పనికి ఫుల్‌స్టాప్ పెట్టాలని కోరారు. లేదంటే కూటమి ప్రభుత్వం అవినీతి అక్రమాలను కలం వీరులు రాష్ట్రవ్యాప్తంగా ఎండగడతారని హెచ్చరించారు.

- విజయవాడలో ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యాన నిరసన తెలిపి ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లో డీఆర్వో ఎం.లక్ష్మీ నరసింహంను కలిసి వినతిపత్రం అందజేశారు.
- జర్నలిస్టులపై అక్రమంగా పెట్టిన కేసులను ఎత్తివేయాలని ఏపీ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.వెంకట్రావు, జి.ఆంజనేయులు, ఏపీ బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్ట్ అసోసియేషన్ కన్వీనర్లు వి.శ్రీనివాసరావు, కె.మునిరాజు శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

నేలరాలిన ఆశలు

- పురుగులు, తెగుళ్లతో యాభై శాతమే కాపు
- పెనుగాలులకు సగానికి పైగా రాలిన మామిడి కాయలు
- ప్రీమియం అధికమవడంతో బీమాపై ఆసక్తి చూపని రైతులు
- ఎన్టీఆర్ జిల్లాలో బీమా తీసుకున్న రైతులు కేవలం 279 మంది
- ఉచిత బీమా కోరుతున్న రైతులు



పూత నిలవక, గాలులకు కాయలు రాలిపోయి వెలవెలబోతున్న మామిడి చెట్టు

జి.కొండూరు: మామిడి రైతులకు ఈ ఏడాది కాలం కలిసి రాలేదు. పూత రావడమే ఆలస్యంగా వస్తే పురుగులు, తెగుళ్లు, వాతావరణంలో మార్పుల కారణంగా యాభై శాతమే కాపు నిలిచింది. సగం పంటతో ఖర్చులైనా వస్తాయనుకుంటే పెనుగాలులు రైతుల ఆశల మీద నీళ్లు చల్లాయి. కాపు నిలిచిన సగంలో మరో సగం కాయలు నేల రాలాయి. ప్రకృతి వైపరీత్యాలలో ఆదుకునేందుకు గతేడాది కేంద్ర, రాష్ట్ర, రైతు భాగస్వామ్యంతో మామిడిలో బీమా పథకాన్ని తీసుకొచ్చారు. అయితే రైతు వాటా ప్రీమియం అధికమవడంతో రైతులు ఈ బీమాపై ఆసక్తి చూపలేదు. దీని వలన ఈ ఏడాది మామిడి రైతులు తీవ్రంగా నష్టపోయారు. వచ్చే ఏడాది నుంచైనా రైతు ప్రీమియంను రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించి ఉచిత బీమాను అందిస్తే మేలు జరుగుతుందని రైతులు కోరుతున్నారు.

98.4 హెక్టార్లకు మాత్రమే

ప్రకృతి వైపరీత్యాల నుంచి మామిడి రైతులను కాపాడేందుకు మామిడికి పునర్వ్యవస్థీకరించిన వాతావరణ ఆధారిత పంటల బీమా పథకాన్ని ప్రవేశపెట్టారు. 2024-25వ సంవత్సరానికి గానూ ఈ రబీ సీజన్ నుంచి ఈ పథకాన్ని అమలు చేశారు. కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ సహకారంతో ప్రారంభించిన ఈ బీమా పథకం జిల్లాల వారీగా బీమా మొత్తం, ప్రీమియం చెల్లింపులను నిర్ణయించారు. అయితే ఎన్టీఆర్ జిల్లాలో బీమా మొత్తం ఎకరానికి రూ.41వేలుగా నిర్ణయించగా, రైతు నుంచి ప్రీమియంగా ఎకరానికి రూ.2,050 చెల్లించాల్సి ఉంది. రైతు వాటా ప్రీమియం అధికంగా ఉండడంతో జిల్లాలో కేవలం 279 మంది రైతులు 98.4 హెక్టార్లకు మాత్రమే బీమాను తీసుకున్నారు. అయితే ఈ బీమాను గతేడాది డిసెంబరు 15వ తేదీ నుంచి ఈ ఏడాది మే 31వ తేదీ మధ్య కాలంలో అధిక వర్షపాతం, గాలిలో తేమశాతం, వాతావరణంలో వ్యత్యాసం, అధిక గాలి వేగం వంటి పరిమాణాల ఆధారంగా బీమాను చెల్లించేందుకు రూపకల్పన చేశారు. దీనిని మండల స్థాయిలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ ఆధ్వర్యంలో నష్ట అంచనాలను లెక్కించి బీమా నిబంధనలకు సరిపోలినప్పుడు మాత్రమే బీమా సొమ్మును రైతుకు అందజేస్తారు.

50వేల టన్నులు కూడా కష్టమే

ఈ ఏడాది ఎన్టీఆర్ జిల్లాలో మామిడి దిగుబడి గతేడాదితో పోలిస్తే సగం కూడా వచ్చే అవకాశం లేదని అంచనాలు వేస్తున్న క్రమంలో ఇటీవల పెనుగాలులతో వచ్చిన అకాల వర్షానికి దిగుబడి పూర్తిగా పడిపోయే అవకాశం ఉంది. గతేడాది జిల్లాలో లక్షా 76వేల టన్నుల వరకు దిగుబడి రాగా ఈ ఏడాది 50 వేల టన్నులు కూడా వచ్చే అవకాశం లేదని అధికారులు అంచనా వేస్తున్నారు. పెట్టిన పెట్టుబడి కూడా రాదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మామిడితో తీవ్రంగా నష్టపోయాను



నాకు ఐదు ఎకరాల మామిడి తోట ఉంది. రెండు ఎకరాలలో మాత్రమే కాపు నిలిచింది. సోమవారం సాయంత్రం వచ్చిన పెను గాలులకు ఉన్న కాయలు కూడా రాలిపోయాయి. ఎకరానికి రూ.40 వేలు పెట్టుబడి పెట్టాను. తీవ్రంగా నష్టపోయాను. వచ్చే సీజన్‌లో మామిడి తొలగించి ఆయిల్‌పామ్ సాగు చేద్దాం అని ఆలోచిస్తున్నా. బీమా కోసం రైతు వాటాను ప్రభుత్వమే చెల్లిస్తే మామిడి రైతుకు భరోసా ఏర్పడుతుంది.

–ఇల్లెందుల కిశోర్, లక్ష్మీపురం, తిరువూరు మండలం

ఉచిత బీమా ఇస్తే మేలు




నాకు నాలుగు ఎకరాల మామిడి తోట ఉంది. ఈ ఏడాది పురుగులు, తెగుళ్లతో పూత రాలిపోయి సగం కాపు కూడా నిలవలేదు. సోమవారం సాయంత్రం వీచిన పెనుగాలులకి కాపు సగానికి పైగా రాలిపోయింది. రెండు లక్షల వరకు పెట్టుబడి పెట్టాను తీవ్రంగా నష్టపోయాను. బీమా కోసం రైతు ప్రీమియం ఎకరానికి రూ.2వేలు అనడంతో కట్టలేకపోయాను. ప్రభుత్వమే ఉచిత బీమా ఇస్తే మాకు మేలు .

–వంగపల్లి నాగరాజు, కొత్త నాగులూరు, రెడ్డిగూడెం మండలం

పేదలపై గుదిబండ

- సిలిండర్‌కు అదనంగా రూ. 50 పెంపు
- జిల్లాలో 6.14 లక్షల గ్యాస్ కనెక్షన్లు
- దీనిలో దీపం కనెక్షన్లు 1,66,289
- పెంపుతో అదనపు భారం రూ. 3.07 కోట్లు



చిలకలపూడి(మచిలీపట్నం): గ్యాస్ సిలిండర్ ధర పెంపు.. పేదలకు గుదిబండగా మారింది. అసలే నిత్యావసర సరుకుల ధరలు భారీగా పెరగడంతోపాటు గ్యాస్ బండ రేటు పెంపు కూడా సామాన్యుడికి భారంగా మారుతోంది. గ్యాస్ డెలివరీ సమయంలో ఏ ధర ఉంటే అదే రేటును కచ్చితంగా గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకులు వసూలు చేస్తున్నారు. ఈ నెల 8న కేంద్ర ప్రభుత్వం బండకు రూ. 50 పెంచుతూ నిర్ణయం తీసుకుంది. దీంతో జిల్లాలో 6.14 లక్షల మంది గ్యాస్ వినియోగదారులపై అదనపు భారం పడింది.

పేదలపై భారం

జిల్లాలో 6.14 లక్షల మంది గ్యాస్ వినియోగదారులు ఉండగా వీరిలో 1,66,289 మంది దీపం కనెక్షన్‌దారులు ఉన్నారు. కేంద్రం నిర్ణయం మేరకు జిల్లాలో గ్యాస్ బండ రూ.50 పెంచినప్పటికీ ఆ భారంపై రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకులు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన రోజు నుంచి రూ. 50 అదనంగా వసూలు చేస్తున్నారు. గతంలో రూ. 835.50 వసూలు చేయగా ఇప్పుడు రూ. 885.50 తీసుకుంటున్నారు. దీంతో జిల్లాలోని 6.14 లక్షల మంది గ్యాస్ వినియోగదారులపై ఒక్కసారిగా భారం పడింది. పేద, మధ్య తరగతి కుటుంబీకులకు సిలిండర్ ధరల పెంపు మరింత భారంగా మారడంతో వారి ఆర్థిక పరిస్థితి కుదేలవుతోంది. గతంలో 835.50కు గ్యాస్‌బండ కొనుగోలు చేయాల్సి వస్తే 6.14 లక్షల మంది 51,29,97,000 చెల్లించాల్సి వచ్చేది. ప్రస్తుతం బండకు రూ. 50 పెంచడంతో 54,36,97,000 చెల్లించాల్సి వస్తోంది. దీంతో గ్యాస్ వినియోగదారులపై అదనంగా 3.07 కోట్లు భారం పడుతోంది. కూటమి ప్రభుత్వం పేద, మధ్య తరగతి కుటుంబాల వారికి తాము అధికారంలోకి వస్తే మేలు చేస్తామని హామీని ఇచ్చింది. అయితే ఈ విధంగా పేద, బడుగు, బలహీన వర్గాల వారిపై నిత్యావసర ధరలు పెంచడంతో కుటుంబ పోషణ మరింత భారంగా తయారైంది.

పేదలపై అధిక భారం



గ్యాస్ బండ ధర పెరగడంతో వినియోగదారులపై అధిక భారం పడింది. ఇప్పటికే నిత్యావసర ధరలు అమాంతంగా పెరిగిపోవడంతో పేదల కుటుంబ జీవనం కష్టతరంగా మారింది. దీనికి తోడు కేంద్ర ప్రభుత్వం బండకు రూ. 50 పెంచడంతో సామాన్య లకు కష్టంగా మారింది.

– బూర సుబ్రహ్మణ్యం, సీఐటీయూ నగర అధ్యక్షుడు

పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలి



పెరుగుతున్న ఖర్చులకు తోడు ఇప్పుడు గ్యాస్ ధరలను కూడా ప్రభుత్వం పెంచి సామాన్యులపై భారం మోపుతోంది. పెంచిన గ్యాస్ ధరలను ప్రభుత్వం వెంటనే తగ్గించాలి. లేకపోతే సామాన్యుడి జీవనయానం ఇబ్బందికరంగా మారుతుంది.

–తమ్ము చాందినీ దుర్గ, మచిలీపట్నం

మహనీయుల జీవితాలే స్ఫూర్తి

- కలెక్టర్ డీకే బాలాజీ
- ఘనంగా పూలే జయంతి



జ్యోతిరావుపూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ డీకే బాలాజీ

మచిలీపట్నంటౌన్: మహనీయుల జీవితాలే విద్యార్థులకు స్ఫూర్తి అని కృష్ణా కలెక్టర్ డీకే బాలాజీ చెప్పారు. నగరంలోని వలందపాలెంలోని మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో శుక్రవారం జ్యోతిరావు పూలే జయంతి జరిగింది. ముఖ్యఅతిథి కలెక్టర్ బాలాజీ.. పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గొప్ప వ్యక్తుల జయంతులు ఎందుకు జరుపుకుంటామని కలెక్టర్ విద్యార్థినులను అడిగి వారిలో స్ఫూర్తిని కలిగించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ మహనీయుల జీవితాలు చదివితే ఎన్నో అంశాలు తెలుస్తాయన్నారు.

పట్టుదలతో ముందుకు

పూలే ఒక పుస్తకం రాస్తున్నప్పుడు కుడి వైపు శరీరమంతా పక్షవాతం వచ్చి మధ్యలోనే ఆపేసే పరిస్థితి ఏర్పడిందన్నారు. అయినా పట్టుదలతో పుస్తకం రాయడం పూర్తి చేశారన్నారు. పట్టుదలతో విద్యార్థులు ముందుకు సాగి అనుకున్న లక్ష్యాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. తన స్నేహితుడు ఒకరు ఐఏఎస్ ప్రాథమిక పరీక్ష ఉత్తీర్ణులయ్యాక, ప్రధాన పరీక్షకు తయారవుతున్న సమయంలో ప్రమాదానికి గురయ్యాడని కలెక్టర్ తెలిపారు. కుడి చేయి పని చేయకపోవడంతో ఎడమ చేతితో పరీక్ష రాయడానికి ప్రయత్నించి ఐఆర్ఎస్ అధికారిగా ఉద్యోగం సంపాదించారని చెప్పారు. మొవ్వకు చెందిన ఓ అమ్మాయి డిగ్రీ చదువుతూ గార్మెంట్ షాపు నడుపుతూ స్ఫూర్తిగా నిలుస్తోందన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు.. కలెక్టర్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ అధికారి రమేష్, పాఠశాల ప్రిన్సిపాల్ ఉషారాణి, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీల్లో అభివృద్ధి పనులు చేపట్టాలి

ఆర్‌డీఎంఏ నాగనరసింహారావు

పెనమలూరు: మున్సిపాలిటీల్లో అభివృద్ధి పనులపై మున్సిపల్ కమిషనర్లు దృష్టి పెట్టాలని, మున్సిపాలిటీలకు ఆదాయం సమకూరే విధంగా పన్నులు సకాలంలో వసూలు చేయాలని రీజినల్ డైరెక్టర్ అప్లేట్ కమిషనర్(ఆర్‌డీఎంఏ)సీహెచ్ నాగనరసింహారావు అన్నారు. కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలకు చెందిన మున్సిపల్ కమిషనర్‌లకు తాడిగడప మున్సిపాలిటీ పరిధిలోని ఒక హోటల్‌లో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీల్లో ఉన్న సమస్యలపై కమిషనర్లు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. సకాలంలో పన్నులు వసూలుకు చర్యలు తీసుకోవాలన్నారు. అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేసి వెంటనే పనులు చేయాలన్నారు. మున్సిపాలిటీల్లో పాలన పారదర్శకంగా ఉండాలని, అవినీతి ఆరోపణలు వస్తే చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. మున్సిపాలిటీల్లో సిబ్బంది పని తీరు మెరుగుపరిచే విధంగా కమిషనర్లు కసరత్తు చేయాలని అన్నారు. సమావేశంలో రెండు జిల్లాల మున్సిపల్ కమిషనర్‌లు, అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

డాక్టర్ చంద్రహాస్‌కు అరుదైన గౌరవం



ఇబ్రహీంపట్నం: ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీం పట్నానికి చెందిన మైనింగ్ రంగ నిపుణుడు డాక్టర్ నిడుముక్కల చంద్రహాస్‌కు అరుదైన గౌరవం దక్కింది. చాంబర్ ఆఫ్ మైనింగ్ అసోసియేషన్, ఇస్తాంబుల్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో టర్కీలో గురువారం రాత్రి జరిగిన ఫ్రాగ్‌బ్లాస్ట్ సింపోసిజం సిరీస్‌లో 36 దేశాల ప్రతినిధులు పాల్గొనగా, సౌత్ ఇండియా తరపున డాక్టర్ చంద్రహాస్ హాజరై ఓపెన్ మైనింగ్ అంశంపై సుదీర్ఘ ప్రసంగం చేశారు. ఓపెన్ మైనింగ్‌పై చంద్రహాస్ ఇచ్చిన ప్రజెంటేషన్‌ను మెచ్చిన ఇస్తాంబుల్ యూనివర్సిటీ ప్రతినిధులు ఆయనకు ప్రశంసాపత్రం అందజేసి అభినందించారు. కెనడాలో 2028లో జరగనున్న సిరీస్‌కు కూడా ఆహ్వానించారు. ఈసందర్భంగా పలువురు చంద్రహాస్‌కు అభినందనలు తెలియజేశారు.

బీసీ మంత్రిత్వశాఖ ఏర్పాటుకు డిమాండ్



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): దేశంలో బీసీ కులాలు సర్వతోముఖాభివృద్ధి చెందాలంటే కేంద్రంలో బీసీ మంత్రిత్వశాఖను ఏర్పాటు చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లాకా వెంగళరావు యాదవ్ కేంద్రాన్ని డిమాండ్ చేశారు. గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం జాతీయ బీసీ సంక్షేమ సంఘం సమావేశం జరిగింది. సమావేశంలో రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షులుగా షేక్ నాగుల్ మీరాను నియమించి ఆయనకు నియామకపత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా లాకా వెంగళరావు యాదవ్ మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు గడిచినా బీసీల జీవితాలలో మార్పు రాలేదన్నారు. తమిళనాడులో బీసీల ఐక్య పోరాట ఫలితంగా 69శాతం రిజర్వేషన్లు సాధించారని గుర్తుచేశారు. అదే తరహాలో దేశ వ్యాప్తంగా బీసీలు పోరాడి రిజర్వేషన్లు సాధించుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లులో బీసీ మహిళలకు సబ్‌కోటా కేటాయించాలని, దేశవ్యాప్తంగా కులగణనతోపాటు బీసీ కులగణను కూడా చేపట్టాలని కోరారు. బీసీల రక్షణ కోసం వెంటనే చట్టాన్ని తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నాగుల్‌మీరా మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన వెంగళరావు యాదవ్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం బీసీ సంఘం నేతలు కలిసి నాగుల్ మీరాను సత్కరించారు.

రాజ్యాంగ హక్కుల్ని కాలరాస్తోన్న ప్రభుత్వం

మాజీమంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వడ్డే శోభనాద్రీశ్వరరావు, విజయరావు

కృష్ణలంక(విజయవాడతూర్పు): లౌకిక రాజ్యాంగ హక్కుల్ని పరిరక్షించాలని, మతసామరస్యం కోరుతూ సొసైటీ ఫర్ కమ్యునల్ హార్మనీ ఆధ్వర్యంలో ఈనెల 13న విజయవాడ నగరంలోని సిద్ధార్థ అకాడెమీ ఆడిటోరియంలో నిర్వహిస్తున్న సమైక్యతా శంఖారావం సదస్సును జయప్రదం చేయాలని నిర్వహణ జాతీయ కమిటీ చైర్మన్ కె.వి జయరావు, రాష్ట్ర సమన్వయకర్త, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు కోరారు. గవర్నర్‌పేటలోని బాలోత్సవ భవన్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సమైక్యతా శంఖారావం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ రాజ్యాంగ కల్పించిన హక్కులను ప్రభుత్వం కాలరాస్తోందన్నారు. భిన్నమతాలు, జాతులు, భాషలు, వర్గాలు, సంస్కృతుల సమాహారంగా ఉన్న మనదేశంలో ప్రజల మధ్య చిచ్చు పెట్టి ఘర్షణలు సృష్టించే విధంగా పాలక బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ శక్తులు కుట్రలు చేస్తున్నాయన్నారు. 1947 చట్టం ప్రకారం చారిత్రక కట్టడాలు, దేవాలయాలు, మసీదులు, చర్చిల విషయంలో ఎలాంటి జోక్యం ఉండరాదన్నారు. ప్రజలందరి ఆమోదం లేకుండా వక్ఫ్ చట్టాన్ని సవరిస్తూ పార్లమెంట్‌లో ఆమోదించడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. వందేళ్ల కిందటే స్వామి వివేకానంద చికాగోలో మనదేశ ఔన్నత్యంపై ప్రసంగించిన వైనాన్ని గుర్తుచేశారు. విజయరావు మాట్లాడుతూ సొసైటీ ఫర్ కమ్యూనల్ హార్మనీ జాతీయస్థాయిలో మత సామరస్యం కోసం కృషి చేస్తుందన్నారు. 13న జరిగే సదస్సులో రాజ్యసభసభ్యుడు ఇమ్రాన్‌ప్రతాప్‌గఢీ, సుప్రీంకోర్టు న్యాయవాది ప్రశాంత్ భూషణ్, యూపీ మాజీమంత్రి మోయిద్‌అహ్మద్ తదితరులు వక్తలుగా పాల్గొంటారని వివరించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబురావు మాట్లాడుతూ ఇటీవల వివిధవర్గాల వారు వివిధరకాల శంఖారావాల పేరుతో నానాయాగీ చేశారన్నారు. పాలకులే మతం, భక్తి పేరుతో రోజుకో మాటలు చెబుతున్నారని, వాటికి ప్రత్యామ్నాయంగా ఈ సదస్సు జరుగుతుందని తెలిపారు. సమావేశంలో మైనారిటీ హక్కుల రాష్ట్ర కన్వీనర్ షేక్ బాజీ, న్యాయవాది మతీన్, సొసైటీ ఫర్ కమ్యూనల్ హార్మనీ కార్యదర్శి అబ్దుల్ రెహమాన్, రైతుసంఘ నాయకుడు వై.కేశవరావు, ఐద్వా నాయకురాలు శ్రీదేవి, అరస నాయకుడు మోతుకూరి రుణ్‌కుమార్, సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతి పూలే

జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు



జ్యోతిరావుపూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు

కోనేరుసెంటర్: నిమ్నజాతుల అభ్యున్నతికి జ్యోతిరావుపూలే చేసిన కృషి మరువలేనిదని జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం మహాత్మా జ్యోతిరావుపూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. పూలే చిత్రపటానికి ఎస్పీ పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ సామాజికతత్వవేత్తగా పూలే ప్రజలను అనేక మార్గాల ద్వారా చైతన్యపరిచారన్నారు. అనాదిగా పాతుకుపోయిన కుల వివక్షను నిర్మూలించేందుకు జీవితాన్నే త్యాగం చేశారన్నారు. మహిళా విద్యా ప్రాముఖ్యతను తెలియజేస్తూ, వితంతు పునర్వివాహాలపై ప్రజల్లో చైతన్యం తీసుకు వచ్చారన్నారు. బడుగు, బలహీన వర్గాల్లో ఆత్మస్థైర్యం నింపి వారి సాధికారత కోసం ఎనలేని కృషి చేసిన మహనీయుడని కొనియాడారు. విద్యాహక్కు కోసం చేసిన ఉద్యమం దేశచరిత్రలో చిరస్మరణీయమని పేర్కొన్నారు. పూలే ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రతిజ్ఞ కృరు సమాజ స్థాపనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.అడిషనల్ ఎస్పీ వి. వి.నాయుడు, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అనుబంధ కమిటీల్లో జిల్లా నాయకులకు చోటు

మచిలీపట్నంటౌన్: వైఎస్సార్ సీపీ రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీల్లో కృష్ణాజిల్లాకు చెందిన పలువురు నాయకులను ఆపార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వివిధ హోదాల్లో నియమించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ప్రకటన విడుదల చేసింది. స్టేట్ స్టూడెంట్ విభాగం ప్రధాన కార్యదర్శులుగా కోడే పండుప్రభు, చిటికిన వెంకటేష్, స్టేట్ పంచాయతీరాజ్ విభాగం ప్రధాన కార్యదర్శిగా పట్టపు నాగేశ్వరరావు, స్టేట్ పంచాయతీరాజ్ విభాగం సెక్రటరీలుగా నామా వెంకటేశ్వరరావు, నాయిడు బాలకృష్ణ, రాష్ట్ర క్రిష్టియన్ మైనార్టీ సెల్ జాయింట్ సెక్రటరీగా మీసాల సత్యవేదంశాస్త్రిలను నియమించారు.

ఎన్టీఆర్ జిల్లా నుంచి..

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఎన్టీఆర్ జిల్లాకు చెందిన పలువురిని రాష్ట్ర అనుబంధ విభాగాల కమిటీల్లో నియమించారు. వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా కేసరి శివారెడ్డి, రాష్ట్ర పంచాయతీరాజ్ వింగ్ ప్రధాన కార్యదర్శిగా ముక్కపాటి నరసింహారావు, రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శులుగా డాక్టర్ రెవరెండ్ సందీప్, కలపాల అజయ్‌కుమార్ నియమితులయ్యారు. ఈమేరకు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటనను విడుదల చేసింది.

స్వచ్ఛ ఓటర్ల జాబితా తయారీకి సహకారం అందించండి

కలెక్టర్ బాలాజీ



రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో స్వచ్ఛఓటర్ల జాబితా తయారీతోపాటు అవసరమైన పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు సహకారం అందించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డీకే బాలాజీ రాజకీయపార్టీల ప్రతినిధులను కోరారు. ఆయన శుక్రవారం తన చాంబర్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎన్నికల అంశాలపై సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ బాలాజీ మాట్లాడుతూ ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణ, క్లెయిమ్‌లు, అభ్యంతరాల పరిష్కారం, అదనపు పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, మార్పులు, చేర్పులు తదితర అంశాలపై తగిన సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. గుడివాడ, మచిలీపట్నం గృహ సముదాయాలు, కరగ్రహారం లేఅవుట్లలోని గృహ సముదాయాలతోపాటు జిల్లా వ్యాప్తంగా ఉన్న వివిధ లేఔట్లలోని గృహ సముదాయాలకు అవసరం మేరకు నూతన పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సీపీఎం ప్రతినిధి కొడాలి శర్మ కలెక్టర్‌ను కోరారు. టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో సెకండరీ గ్రేడ్ టీచర్స్ (ఎస్‌జీటీ)లకు ఓటుహక్కు కల్పించే విధంగా చూడాలని కోరారు. ఒకే వీధిలో ఉండే ఓటర్లందరికీ ఒకే పోలింగ్ కేంద్రంలో ఓటు ఉండేలాగా తగిన చర్యలు తీసుకోవాలని రాజకీయ పార్టీల ప్రతినిధులు కోరారు. సమావేశంలో డీఆర్వో కె.చంద్రశేఖర రావు, మచిలీపట్నం ఆర్డీవో కె.స్వాతి, ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

సెపక్ తక్రా రాష్ట్ర జట్లు ఎంపిక



విజయవాడస్పోర్ట్స్: మణిపూర్‌లో ఈనెల 15నుంచి 21వ తేదీ వరకు జరుగనున్న జాతీయ స్కూల్ గేమ్స్ అండర్-17 బాలబాలికల సెపక్ తక్రా పోటీలకు ప్రాతినిధ్యం వహించే రాష్ట్ర జట్లను ఎంపిక చేసినట్లు ఏపీ స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి జి.భానుమూర్తిరాజు తెలిపారు. బాలురు జట్టుకు జి.సతీష్, కె.కుశల్, డి.ఎం.షాహిద్, టి.జశ్వంత్, టి.వంశీ, బాలికలు జట్టుకు పి.హరిప్రియ, కె.వెంకటలక్ష్మి, పి.దుర్గమధురశ్రీ, సి.తేజ, జి.రమ్య ఎంపికైనట్లు వివరించారు. ఈ జట్లుకు కోచ్, మేనేజర్‌లుగా ఎస్.రమేష్, ఎం.సంతోషికుమారి, డి.సుంకరరావు వ్యవరిస్తారని వెల్లడించారు. ఈ జట్లను సమగ్ర శిక్షా రాష్ట్ర పథక సంచాలకులు(ఎస్‌పీడీ) బి.శ్రీనివాసరావు పటమట జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం అభినందించారు.

బీసీలకు 52శాతం రిజర్వేషన్లు కల్పించాలి



మాట్లాడుతున్న బి.పుష్పరాజ్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలో జనాభా ప్రాతిపదికన బీసీలకు 52శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీఎస్పీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి బి.పుష్పరాజ్ డిమాండ్ చేశారు. బీసీలకు 52శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ బీఎస్పీ ఎన్టీఆర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో విజయవాడ అలంకార్ సెంటర్‌లోని ధర్నా చౌక్‌లో శుక్రవారం ధర్నా చేశారు. ఈసందర్భంగా పుష్పరాజ్ మాట్లాడుతూ రాష్ట్ర జనాభాలో బీసీలు 52శాతం ఉన్నారని గత ప్రభుత్వం లెక్కలతో తేల్చిందన్నారు. ఆ మేరకు బీసీలకు విద్యా, ఉద్యోగాలు, స్థానిక సంస్థలపదవుల్లో రిజర్వేషన్లు కల్పించాలన్నారు. బీహార్ సీఎం నితీష్‌కుమార్ కులగణన జరిపి బీసీలకు 65శాతం రిజర్వేషన్లు ప్రకటించారని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం బీసీ జనాభా లెక్కలు బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శులు కొదమల ప్రభుదాసు, గంగవరపు దేవా, జిల్లా అధ్యక్షుడు ఉదయ్‌కిరణ్‌యాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు దొండపాటి శామ్యూల్ కుమార్, సిటీ కన్వీనర్ పి.డేనియల్, నాయకులు దాసరి కృష్ణ, ఉదుముల బుజ్జి, మద్దిరాల వినోద్, కోటేశ్వరరావు, మల్లాది అశోక్, బూదాల బాబురావు, కె.వి.రత్నం, నందిగం రామ్మోహన్, మేకల దుష్యంత్, ప్రత్తిపాటి మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకు కదిలిరావాలి



చల్లపల్లి ప్రధాన సెంటర్‌లో ఆందోళన చేస్తున్న సీపీఐ నాయకులు

చల్లపల్లి: దేశ అభివృద్ధి, ప్రజాస్వామ్య పరిరక్షణకై ప్రజలంతా కదిలి రావాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర నాయకులు హనుమానుల సురేంద్రనాద్ బెనర్జీ పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సీపీఐ ఆధ్వర్యంలో చేపట్టిన దేశవ్యాప్త ప్రచార ఆందోళనలో భాగంగా శుక్రవారం చల్లపల్లిలో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా సురేంద్రనాద్ బెనర్జీ మాట్లాడుతూ ప్రధాని మోదీ నాయకత్వంలోని ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దేశం అన్నిరంగాల్లో తిరోగమనంలో పయనిస్తోందన్నారు. 2014లో మోదీ అధికారంలోకి వచ్చేనాటికి రూ.450 ఉన్న వంట గ్యాస్ సిలిండర్ ధర ప్రస్తుతం రూ.870 కావడమే ఇందుకు నిదర్శనమన్నారు. విద్యుత్ ఛార్జీల భారం ప్రజలకు పెనుశాపంగా మారిందన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం బీజేపీకి దాసోహమైందన్నారు. డెప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సంఘ్‌పరివార్ శక్తులకు ప్రతినిధిగా వ్యవహరిస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. మోదీ ప్రభుత్వ అడుగులను సీఎం చంద్రబాబు ప్రభుత్వం అమలుపరుస్తూ ప్రజలపై భారాలు మోపుతోందని మండిపడ్డారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రజల పక్షాన నిరంతరం పోరాడే సీపీఐ బలోపేతానికి ప్రజలంతా తోడ్పాటునందించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి అడ్డాడ ప్రసాద్‌బాబు, రైతుసంఘం జిల్లా కార్యదర్శి గుత్తికొండ రామారావు, నాయకులు చంద్ర సుబ్బారావు, కొర్రపాటి ముఖర్జీ, నక్కా శ్రీను, కొల్లూరి శ్రీధర్, వెంకటేశ్వరరావు, సిద్దాబత్తుల వాసు, నాగమల్లి తదితరులు పాల్గొన్నారు.

వంశీ బెయిల్ పిటిషన్‌పై విచారణ వాయిదా

గన్నవరం: సత్యవర్ధన్ కేసులో గన్నవరం మాజీఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీ మోహన్ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్ మరోసారి వాయిదా పడింది. విజయవాడలోని ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టులో వంశీ మోహన్ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై శుక్రవారం విచారణ జరిగింది. అయితే ఈ కేసు ఇన్విస్టిగేషన్ ఆఫీసర్ ఏసీపీ, ప్రాసిక్యూషన్ తరుపున కళ్యాణి, రాజేంద్రప్రసాద్ వివిధ కారణాలు చూపుతూ కోర్టుకు హాజరుకాలేదు. బెయిల్ పిటిషన్‌పై విచారణ జరిగే ప్రతిసారి వివిధ కారణాలతో ఈ కేసులో కీలకమైన ఇన్విస్టిగేషన్ అధికారి, ప్రాసిక్యూషన్ న్యాయవాదులు హాజరుకాకపోవడంపై పిటిషనర్ తరుపు న్యాయవాది దేవి సత్యశ్రీ అభ్యంతరం వ్యక్తం చేశారు. కేవలం బెయిల్ పిటిషన్‌పై విచారణను జాప్యం చేసేందుకు చూస్తున్నట్లుగా ఉందని సందేహం వ్యక్తపరిచారు. ప్రాసిక్యూషన్ న్యాయవాదులు సెలవులో ఉన్నప్పుడు కనీసం ఇన్‌చార్జ్‌ను పెట్టకపోవడం, ఇన్విస్టిగేషన్ ఆఫీసర్ ఏసీపీకి బదులుగా సీఐ కోర్టుకు రావడంపై అభ్యంతరం వ్యక్తంచేశారు. అనంతరం న్యాయమూర్తి ఈ కేసు విచారణను వచ్చే మంగళవారానికి వాయిదా వేశారు.

● **కల్యాణం. .కమనీయం**

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వరస్వామి వారి ఆలయ ప్రాంగణంలో శ్రీగంగా పార్వతి(దుర్గ) సమేత మల్లేశ్వర స్వామి వార్ల కల్యాణం శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఈఓ పర్యవేక్షించారు.